manachourasta

# మన చౌరాస్తా

The Complete News way


మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 176 | ఆదివారం | 08.12.2024



## మాజీ సీఎంకు ఆహ్వానం

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని మాజీ కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. శనివారం ఫాం హౌస్ లో ఉన్న కేసీఆర్‌ను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు కలిసి ప్రజాపాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు హాజరుకావాలని ఆహ్వానించారు. - హైదరాబాద్, మన చౌరాస్తా



హైకోర్టు న్యాయవాదిగా

## ధర్మభిక్షం

- పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తానని వెల్లడి

3 లో



2 లో

కాంగ్రెస్ హయాంలోనే

## తెలంగాణ అభివృద్ధి

- కేసీఆర్ ప్రభుత్వంలో అంతా దోపిడే
- దోచుకున్న సొమ్ము ఇతర దేశాల్లో దాచుకున్నరు
- జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



ప్రతిభను వెలికి తీసేందుకే 3

## క్రీడా పోటీలు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## మల్లన్న ధర్మకర్తల ప్రమాణ స్వీకారం 3

- ప్రమాణం చేసిన 9 మంది ధర్మకర్తలు



కనులపండువగా 4

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ వేడుకలు



# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

- **కేసీఆర్ ప్రభుత్వం అంతా దోపిడే**
- **డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎందరో ఆత్మ బలిదానాలతో తెలంగాణ ఏర్పడిందన్నారు. అలా ఏర్పడిన రాష్ట్రాన్ని 10 ఏళ్లు పాలించిన కేసీఆర్ కుటుంబం నిలువు దోపిడీ చేసిందన్నారు. హరీష్ రావు, కేటీఆర్ ఇద్దరు కలిసి దోచుకున్న సంపాదన అంతా ఇతర దేశాల్లో దాచి పెట్టారని ఆరోపించారు. ఇక కవిత ఆడవారు చేయకూడని సారయి కేసులో జైలుకు వెళ్లి వచ్చిందన్నారు. అందుకే వారికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ఇక కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు. ఒక వైపు కేసీఆర్ చేసిన అప్పులను కొడుతూనే ఈ రాష్ట్ర ప్రజల యొక్క అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర పథకాలను అమల్లోకి తీసుకువచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అన్నారు.

## పల్లాకు ప్రజలే సమాధానం చెబుతారు

ఇక స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తన విద్యాసంస్థల్లో చదువుతున్న పిల్లలు తల్లిదండ్రులు పేర్లతో 20 వేల దొంగ ఓట్లను ఈ నియోజకవర్గంలో నమోదు చేపించి గెలిచానని సంబుర పడుతున్నాడని కొమ్మూరి అన్నారు. ఈ నియోజకవర్గంలో ఏ పని చేయాలన్న ప్రోటోకాల్ అంటూ మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని అనుకుంటే ప్రజలే తిరగబడి సమాధానం చెబుతారన్నారు. కార్యక్రమంలో ప్రజాపాలన విజయోత్సవ ఇన్‌చార్జి సిహెచ్ శ్రీనివాస్, పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రాజమౌళి, లకావత్ లక్ష్మీనారాయణ, జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, మహిళా అధ్యక్షురాలు కాంగ్రెస్ స్టేట్ కో ఆర్డినేటర్ నీలం పద్మ, జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా, ఎస్సీ సెల్ అధ్యక్షులు గనిపాక మహేందర్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నరసింహా రెడ్డి, జనగామ కౌన్సిలర్లు వంగాల కళ్యాణి మల్లారెడ్డి, గాదేపాక రాంచందర్, జక్కుల అనిత వేణు, మంత్రి సుమలత శ్రీశైలం, బొట్ల శ్రీను, జనగామ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చి రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, రాజాబోయిన లక్ష్మీనారాయణ, వగలబోయిన యాదగిరి, మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజే మల్లేశం, చేర్యాల మండల అధ్యక్షులు కొమ్ము రవి, దూల్మిట్ట మండల అధ్యక్షులు కోల సాయిలు, చేర్యాల మార్కెట్ వైస్ చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి, శ్రీధర్, మైనారిటీ నాయకులు జమల్ షరీఫ్, జాఫర్ షరీఫ్, కొల్లూరి శివ, బొట్ల నర్సింగరావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కీసర దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

- **ఇందిరమ్మ ఇళ్ల సర్వే సజావుగా నిర్వహించాలి**
- **అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్**

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లాలోని దేవరుప్పుల మండలంలోని చిన్న మడూర్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలో భాగంగా క్రీడాకారులను అభినందిస్తూ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే క్రీడాకారులతో మమేకమై కబడ్డీ ఆడగా, వారిలో మరింత స్ఫూర్తిని, ఉత్తేజాన్ని కలిగించారు. నేటి నుంచి జనవరి 2 వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అన్ని రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదే విధంగా ఈ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అదే మండలంలోని పెద్ద మడూర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పర్యవేక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా లబ్ధిదారుల వివరాలను సేకరిస్తూ ఆన్‌లైన్‌లో సజావుగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ మహిపాల్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీఓ సురేష్ పాల్గొన్నారు.



# నాసా కిట్ల బహూకరణ

**వరంగల్, మన చౌరాస్తా :** రంగశాయి పేట పట్టణంలో గల రెనాల్డ్స్ హైస్కూల్లో నాసా కిట్ల బహుకరణ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ భవిష్యత్ లో భూమి నివాస యోగ్యం కానీ యెడల అంతరిక్షం ప్రత్యామ్నాయంగా ఉంటుందని, అయితే అంతరిక్షం పైన గల వాతావరణ పరిస్థితిల పట్ల నివాసానికి తగిన అంశాల మీద పరిశోధన చేసి విద్యార్థులలో పాఠశాల స్థాయి నుంచి అవగాహన తీసుకురావడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. అలాగే విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును నాసాకి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా విచ్చేసిన స్థానిక డిగ్రీ కళాశాల ఫిజిక్స్ డిపార్ట్మెంట్ (హెడ్) నరేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి ఈ యొక్క టెక్నాలజీ అంతరిక్ష పరిశోధన పట్ల విద్యార్థులలో అవగాహన పెంపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డిజిఎం చేతన్, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ తిరుమలరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్, డీన్ కిరణ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రతిభని గుర్తించేందుకే క్రీడా పోటీలు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- ప్రారంభమైన సీఎం కప్ క్రీడా పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ఉండే ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం నుంచి నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను ధర్మకంచ మినీ స్టేడియంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి మొదలైన సీఎం కప్ పోటీలలో నిర్వహించే అన్ని క్రీడల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చూపించి రాష్ట్ర స్థాయికి చేరుకోవాలని, అక్కడ కూడా వివిధ పోటీలలో గెలిచి జిల్లాకి మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ రోజు నుంచి రేపటి వరకు గ్రామ పంచాయతీల్లో, 10 నుంచి 12వ తేదీల్లో మండలాల్లో, 7 నుంచి 9 మున్సిపాలిటీలో, 16 నుంచి 21వ తేదీల్లో జిల్లా స్థాయిలో, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో రన్నింగ్, లాంగ్ జంప్, యోగ,ఫుట్ బాల్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్ బాల్,కోకో కబడ్డీ, స్విమ్మింగ్, చెస్, జుడో మొదలగు క్రీడలను నిర్వహిస్తున్నరని తెలిపారు. క్రీడాకారులకు ఈ పోటీలు మంచి అవకాశం అని, ఒకటో, రెండో క్రీడలకే పరిమితం కాకుండా ప్రతీ ఆటలో పాల్గొని తమ ప్రతిభని చూపెట్టాలన్నారు. అలాగే పోటిల్లో పాల్గొనే ప్రతీ ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని, వివిధ సందర్భాలలో విద్యార్థులకు ఈ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగి మంచి పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం ఈ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను కలెక్టర్ పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ జమున, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలు

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా శనివారం రోజున చేర్యాల మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య కార్మికులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సిబ్బందికి ఉచిత మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి, ఐదో వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.






# షాద్‌నగర్ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

**పాలకుర్తి , మన చౌరాస్తా :** తమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై చర్యలు తీసుకోవాలనీ కోరుతూ పాలకుర్తి వెలమ సంఘం సంఘం నాయకులు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సంక్షేమ సంఘం నాయకుల ప్రెస్ మీట్ తెలిపారు. ప్రజాప్రతినిధి అయి ఉండి కులం పేరుతో తిట్టడం ఏమాత్రం సరికాదని వాపోయారు. తక్షణమే వెలమ కులస్తులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సేవ చేయడంలో తాము ముందు వరుసలో ఉంటా మన్నారు. క్షమాపణలు చెప్పకపోతే పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య నేతలు వీరమనేని సోమేశ్వర్ రావు, వెంకటేశ్వర రావు, మురళీధర్ రావు, భుజంగా రావు, వేణు రావు, కళింగ రావు, రాజేశ్వర్ రావు, రమేష్ రావు, చలపతి రావు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయవాదిగా ధర్మభిక్షం



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటం చేస్తున్న ధర్మ భిక్షం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదిగా శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ధర్మ భిక్షం మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ అలుపెరుగని పోరాటాలు చేస్తూ విద్య రంగ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేసినట్టు చెప్పారు. నేటి నుంచి అడ్వకేట్ గా ఓవైపు హక్కుల కోసం మరోవైపు న్యాయం కోసం భవిష్యత్తులో పని చేస్తానని చెప్పారు. క్రిమినల్, సివిల్ సంబంధించిన కోర్టు సమస్యలు, బెయిల్ సమస్యలు ఉంటే నాకు తెలియజేయాలని కోరారు. మరి ముఖ్యంగా దళిత గిరిజనుల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, అసైన్డ్ భూములు సివిల్ కేసులు, క్వాష్ పిటీషన్ దాఖలు ఉచితంగా చేస్తానని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజల పక్షాన న్యాయం కోసం పని చేస్తానని, ఎవరైనా న్యాయ సలహాలు కావాలంటే తనను 9010801452 నంబర్‌లో సంప్రదించవచ్చారు.

## సోషల్ మీడియా మండల అధ్యక్షుడిగా రాజు యాదవ్



**పాలకుర్తి, మన చౌరాస్తా :** అఖిల భారత యాదవ మహాసభ సోషల్ మీడియా పాలకుర్తి మండల అధ్యక్షుడిగా ఈరవెన్ను గ్రామానికి చెందిన జక్కుల రాజు యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షులు సిద్ధి రాజ్ యాదవ్ శనివారం తెలిపారు. నూతన అధ్యక్షుడు జక్కుల రాజు యాదవ్ మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన యాదవ మహాసభ జిల్లా నాయకులు, మండల, యాదవ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## మల్లన్న ఆలయంలో ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

**కొమురవెల్లి, మనచౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర దగ్గర పడుతున్న క్రమంలో నూతనంగా నియామకమైన 8 మంది ధర్మకర్తలు, ఎక్స్ ఆఫీసియో మెంబర్ ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌తో కలిపి 9 మంది శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తలుగా చిగిరి కొమురయ్య, కాయిత మోహన్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వలాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, నేరేళ్ల పల్లి మచ్చేందర్ రెడ్డి, కొప్పురపు జయప్రకాశ్ రెడ్డి నియామకం కాగా వారితో ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ తో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎ.చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిషనర్ బాలాజీ శర్మ, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

General News



# కనులపండువగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

**భక్తులతో కిటకిటలాడిన అయ్యప్ప ఆలయం**

**చేర్యాల, మన చౌరాస్తా :** సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా లోకకల్యాణం కోసం చేర్యాల పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు తాటిపెల్లి శకుంతల, ఆంజనేయులు గుప్త ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణాన్ని కనుల పండుగ నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవార్లకి మాంగళ్యధారణ చేసి.. ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా కల్యాణం జరిపితే సకల శుభాలు సిద్ధించడంతో పాటు సంతాన ప్రాప్తి కలుగుతుందని అర్చకులు వివరించారు.



## పాలకుర్తి సోమన్న ఆలయంలో...



**పాలకుర్తి, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. చండిక అమ్మవారి ఆలయంలో కళ్యాణం మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య మహా వైభవోపేతంగా జరిపించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని కనులారా తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్ బాబు , సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# గౌడుల ఐక్యతకు వేదికగా 'గోపా'

**జనగామ, మన చౌరాస్తా :** బహుజన రాజ్యాధికార సాధన లక్ష్యసాధనకు ముందు నిలిచే గౌడుల ఐక్యతకు గౌడ అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) వేదికగా పని చేస్తుందని గోపా జనగామ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం జరిగిన గోపా జనగామ పట్టణ కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ గౌడ జనులందరూ తమ తమ ప్రాంతాలలో గౌడుల పిల్లలను విద్యావంతులుగా చేయుటకు తోడ్పాటు అందించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఉండే పట్టణ గోపా కార్యవర్గం ఆదర్శంగా ఉండే పని చేయాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా నాయకులు



బైరగోని శ్రీనివాసు గౌడ్, రాజా సంపత్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జనగామ పట్టణ గోపా అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు గునీగంటి రామకృష్ణ మరోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొల్లెపల్లి విశ్వనాథ్ గౌడ్, కోతి విజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా కన్నా శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులుగా పాముకుంట్ల కిరణ్ గౌడ్, అనంతుల అనిల్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పాముకుంట్ల సుధాకర్ గౌడ్, సుధగాని విజయ్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా రంగు సుధాకర్ గౌడ్, గైకోటి రాజ్ గౌడ్, కళ్లెపు వీరేష్ గౌడ్, పరకాల శ్రీనివాస్ గౌడ్, మేడిపల్లి కృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు.



# పెళ్లికూతురును ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లా

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ దంపతుల కూతురు వాణి వివాహం నేడు (ఆదివారం) జరగనున్న క్రమంలో శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముందస్తుగా పెళ్లికూతురును ఆశీర్వదించారు. వివాహ మహోత్సవానికి వచ్చే అవకాశం లేనందున శనివారం చేర్యాల పట్టణానికి వచ్చిన క్రమంలో పెళ్లికూతురును ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిండు నూరేళ్లు నూతన వధూవరులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జర్నలిస్ట్ జిల్లా అజయ్ కుమార్ దంపతులు, అంకుగారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మల్లేశం, కందుకూరి సిద్ధిలింగం గుప్తా, తాడెం రంజిత కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



# సహకార బ్యాంకు భవనం మంజూరు

**బోథ్, మన చౌరాస్తా :** త్వరలో సొనాల మండల కేంద్రంలో సహకార (ADCC) బ్యాంక్ నూతన హంగులతో భవనం మంజూరైందని జీఎం సూర్య ప్రకాష్ తెలిపారు. శనివారం ఏజీఎం అభయ్ కుమార్ తో పాటు సోనాల మండల కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటికే సహకార సంఘానికి సంబంధించిన స్థలం ఉండటంతో అందులోనే నూతన హంగులతో భవన నిర్మాణం చేసి బ్యాంకును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహకార సంఘం డైరెక్టర్ లోలపు పోశెట్టి, బోథ్ సహకార సంఘం సీఈఓ గోలి స్వామి, ప్రజలు పాల్గొన్నారు.

# లయన్ బాల్దే సోమయ్య మృతి



**జనగామ, మన చౌరాస్తా :** లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ పూర్వ అధ్యక్షుడు లయన్ బాల్దె సోమయ్య (65) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అస్వస్థతతో ఉండి కన్ను మూశారు. దివంగత లయన్ నాయకుడు జనగామ పట్టణ కురుమ సంఘం మాజీ అధ్యక్షులు, జనగామ మున్సిపల్ మాజీ కౌన్సిలర్, ప్రస్తుతం కురుమ సంఘం కోపా గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. కురుమ సంఘానికి ఎన్నో సేవలు అందించిన బాల్దె సోమయ్య మృతి కుటుంబ సభ్యులు, కురుమ సమాజానికి తీరని లోటని పలువురు అన్నారు. వీరు నివాసం ఉంటున్న 3 వ వార్డు కు చెందిన రాజకీయ నాయకులు ప్రముఖులు, లయన్స్ ప్రముఖులు వారి గృహం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. దివంగత లయన్ కు భార్య, వివాహితులైన ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

Health special



## చలికాలంలో పిల్లలకు

# అరటిపండు ఇవ్వొచ్చా?

కార్బోహైడ్రేట్లు, జింక్, సోడియం, ఐరన్ పుష్కలంగా ఉన్న అరటి పిల్లల మొత్తం అభివృద్ధికి మంచి పండు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పిల్లలకు అరటిపండు ఇవ్వడం వల్ల వారి.. చలికాలంలో ఇంట్లో ఉండే పిల్లలను చలి నుంచి ఎలా కాపాడుకోవాలి? శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో చాలాసార్లు తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. ఒక వైపు పిల్లలు అరటిపండును తినడానికి చాలా ఇష్టపడతారు. ఇప్పుడు చలికాలంలో జలుబుకు కారణమయ్యే వాటికి దూరంగా ఉంచాలి. ఇదిలా ఉండగా చలికాలంలో పిల్లలకు అరటిపండు తినిపించాలా వద్దా ? అనే సందిగ్ధం నెలకొంది. నిజానికి ఇంట్లో పెద్దలు అరటిపండు వల్ల జలుబు వస్తుందని, అందుకే ఈ సీజన్‌లో పిల్లలకు తినిపించకూడదని చెబుతుంటారు. కానీ పిల్లల డెవలప్‌మెంట్ కోసం వారు సరైన పోషకాహారాన్ని పొందడం చాలా ముఖ్యం. ఈ పరిస్థితిలో పిల్లలకి చిన్న పరిమాణంలో కానీ సరైన పరిమాణంలో కానీ ప్రతిదీ తినిపించాలి. దీనితో మొదట పిల్లవాడు ప్రతిదీ తినే అలవాటును పెంపొందించుకుంటాడు. అలాగే రెండవది బిడ్డ కూడా సరిగ్గా అభివృద్ధి చెందుతుంది. చలికాలంలో పిల్లలకు అరటిపండు తినిపించవచ్చా లేదా అనేది ఇప్పుడు తెలుసుకోవడం ముఖ్యం. కార్బోహైడ్రేట్లు, జింక్, సోడియం, ఐరన్ పుష్కలంగా ఉన్న అరటి పిల్లల మొత్తం అభివృద్ధికి మంచి పండు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పిల్లలకు అరటిపండు ఇవ్వడం వల్ల వారి బరువు పెరగడంతోపాటు ఎముకలు దృఢంగా మారడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో పిల్లలకు ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండు ఇవ్వవచ్చు. అరటిపండులో మంచి మొత్తంలో పీచు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి ఉన్నాయి. ఇవి శరీరాన్ని కాలానుగుణ వ్యాధుల నుండి రక్షించడంలో చాలా సహాయపడతాయి. ఏ ఇతర సమస్య లేకపోయినా చలికాలంలో కూడా అరటిపండ్లను పిల్లలకు ఇవ్వవచ్చని నిపుణులు చెబుతున్నారు. కానీ పిల్లలకి జలుబు లేదా దగ్గు ఉంటే అరటిపండు తినిపించడం మంచిది కాదు. ఎందుకంటే అరటిపండు శ్లేష్మం లేదా కఫంతో తాకినప్పుడు చికాకు కలిగిస్తుంది. ఇలాంటి సమయంలో అరటిపండు ఇచ్చే ముందు పిల్లల వైద్యున్ని సంప్రదించి నిర్ణయం తీసుకోవడం మంచిది. అరటిపండు పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పిల్లలు చాలా పరిగెత్తడం వల్ల వారి శక్తి కూడా చాలా త్వరగా ఖర్చు అయిపోతుంటుంది. అటువంటి పరిస్థితిలో అరటి వారికి పవర్‌హౌస్, ఇది వారికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. అరటిపండు కార్బోహైడ్రేట్లు, చక్కెర ఆరోగ్యకరమైన మూలం. ఫైబర్ పుష్కలంగా ఉండే అరటిపండ్లు జీర్ణక్రియకు ఎంతగానో సహకరిస్తాయి. మీ బిడ్డకు యూరినరీ ఇన్ఫెక్షన్ లేదా ఏదైనా రుగ్మత ఉన్నట్లయితే, డాక్టర్‌ని సంప్రదించిన తర్వాత, మీరు పిల్లలకు రోజూ అరటిపండు తినిపించవచ్చు. అటువంటి పరిస్థితిలో అతని పరిస్థితి త్వరలో మెరుగుపడుతుంది. అరటిపండ్లు జ్వరంతో పోరాడడంలో కూడా సహాయపడతాయి.

## రోజుకు ఎన్నిసార్లు

# చేతులు కడుక్కోవాలి?



**మన చర్మంలోని** మొదటి పొరలో మనకు మేలు చేసే లక్షలాది బ్యాక్టీరియాలు ఉంటాయి. దీనితో పాటు, ఈ పొర నుండి సహజ నూనెలు బయటకు వస్తాయి. ఇవన్నీ కలిసి మన రోగనిరోధక శక్తిని.. మీ శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మంచిది. చేతులు మురికిగా ఉన్నప్పుడల్లా చేతులు శుభ్రం చేసుకోవాలి. కానీ కొందరు చేతులు పదేపదే కడుక్కొంటారు. ఇది మంచి అలవాటు కాదంటున్నారు నిపుణులు. మరి రోజుకు ఎన్ని సార్లు చేతులను శుభ్రం చేసుకోవలో చూద్దాం. దీనికి సంబంధించి, సికె బిర్లా హాస్పిటల్‌లోని ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ తుషార్ తాయల్ మాట్లాడుతూ.. మీరు మీ చేతులను రోజుకు ఎన్ని సార్లు శుభ్రం చేసుకోవాలి..? మీ చేతులు ఎంత మురికిగా ఉన్నాయి ? మీరు ఎలాంటి పని చేస్తారు ? అనే దానిపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. మీరు ఏదైనా పని చేస్తున్నప్పుడు, చాలా దుమ్ము ఉన్నప్పుడు మీరు మీ చేతులను శుభ్రం చేసుకోవాలి. మీరు బయటకు వెళ్లి ఎక్కువసేపు ఉంటే, మీ చేతులు ఖచ్చితంగా మురికిగా మారుతాయి. ఈ పరిస్థితిలో మీరు మీ చేతులను శుభ్రం చేసుకోవాలి. చేతులు శుభ్రపరచడానికి సూత్రం ఏమిటంటే, మీ చేతులపై మురికి కనిపిస్తే, మీరు మీ చేతులను శుభ్రం చేసుకోవాలి. లేకపోతే, మీరు బయటి వ్యక్తులతో పరిచయం ఏర్పడినప్పుడల్లా, మీ ముఖాన్ని తాకినప్పుడు, మీ చేతులను ముందుగా శుభ్రపరచుకోండి. అలాగే ఏదైనా తినే ముందు మీ చేతులను శుభ్రపరచుకోండి. లేదంటే శానిటైజ్ చేసుకోవడం మంచిదంటున్నారు. ఏదైనా మురిగిగా ఉన్నప్పుడు, మీరే చేసే పనిని బట్టి చేతులను శుభ్రం చేసుకోవడం అవసరం. అంతేగానీ ప్రతి దానికి చేతులు శుభ్రం చేసుకోవడం మంచి అలవాటు కాదంటున్నారు. కొంతమంది తమ చేతులను చాలా తరచుగా శుభ్రం చేసుకుంటారు. అది ఇతరులకు ఆందోళన కలిగిస్తుంది. ఇది అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అనే వ్యాధి అని డాక్టర్ తుషార్ తాయల్ చెప్పారు. ఇది ఒక మానసిక స్థితి. పదేపదే అనుమానంతో చేతులను శుభ్రం చేసుకునే వ్యక్తి తన ఆరోగ్యంపై కూడా అనుమానాలు ఉంటాయంటున్నారు. ఇది ఒక పోబియాలాగా. ప్రతి నిమిషానికి మనం చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే, మనకు అనారోగ్యం వస్తుందని భయపడిపోతుంటారు. కొంతమంది తమ ఇళ్లను 10 సార్లు కంటే ఎక్కువ శుభ్రం చేస్తారు. ఇంట్లోకి ఎవరైనా అడుగు పెట్టగానే వెంటనే ఇంటిని శుభ్రం చేయడం మొదలుపెడతారు. ఇది వారి అనుమానం మాత్రమేనని అంటున్నారు. మన చర్మంలోని మొదటి పొరలో మనకు మేలు చేసే లక్షలాది బ్యాక్టీరియాలు ఉంటాయి. దీనితో పాటు, ఈ పొర నుండి సహజ నూనెలు బయటకు వస్తాయి. ఇవన్నీ కలిసి మన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇది బాహ్య ఇన్ఫెక్షన్ల నుండి మనలను రక్షిస్తుంది. అలాంటప్పుడు మళ్లీ మళ్లీ చేతులు కడుక్కుంటే చర్మంలోని మొదటి పొర దెబ్బతినడంతోపాటు అనేక రకాల నష్టాలను చవిచూడాల్సి వస్తుందంటున్నారు. మొదటి పొర తొలగిపోయినట్లయితే ఏదైనా సూక్ష్మ జీవి మీ రక్తప్రవాహంలోకి సులభంగా ప్రవేశించి మీకు ఇన్ఫెక్షన్‌ని ఇస్తుంది. రెండవది మీరు తరచుగా చేతులు కడుక్కుంటే చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుంది. దాని మెత్తదనం పోతుంది. చర్మం కూడా మళ్లీ మళ్లీ వాచిపోతుంది. అలాగే మీరు నొప్పిని కూడా అనుభవిస్తారు. అందువల్ల, అవసరమైనంత వరకు మాత్రమే చేతులు కడుక్కోవాలి. చేతులు మురికిగా కనిపించినప్పుడు మాత్రమే కడగాలి. చాలా అవసరాలను శానిటైజ్ చేయడం ద్వారా మంచిదంటున్నారు.

# ఆకుకూరల్లో పోషకాలు పోవద్దంటే..



ఆకు కూరలు తింటే ఆరోగ్యం పథిలంగా ఉంటుంది. త్వరగా వ్యాధులు ఎటాక్ చేయకుండా ఉంటాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అయితే ఆకు కూరలను వండటం ఎవరికీ తెలీదు. ఎలా పడితే అలా వండితే అందులో ఉండే పోషకాలు పోతాయి. ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఆకు కూరల్లో అనేక రకాల పోషకాలు లభిస్తాయి. వారంలో రెండు, మూడు సార్లు అయినా ఆకు కూరలు వండుకుని తినడం చాలా మంచిది. ఆకు కూరలు తినడం వల్ల శరీరంలో ఉండే మలినాలు అన్నీ పోతాయి. అయితే ఆకు కూరల్ని ఎలా వండాలో చాలా మందికి తెలీదు. తెలీకుండా ఎలా పడితే అలా వండటం వల్ల పోషకాలు అన్నీ పోతాయి. దీని వల్ల ఆకు కూరల్ని తిన్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. మరి ఆకు కూరల్ని ఎలా వండితే ప్రయోజనాలు అందుతాయో ఇప్పుడు చూద్దాం. సాధారణంగా ఆకు కూరల్ని కట్ చేసి కడుగుతారు. కానీ ముందు కడిగేసి కట్ చేయడం వల్ల పోషకాలు ఉంటాయి. ఒక వేళ ఇలా చేయడం ఇబ్బంది అవుతుంది అనుకుంటే.. కట్ చేశాక కడిగి, కాసేపు వేడి నీళ్లు పోసి ఉంచండి. ఇలా చేయడం వల్ల పోషకాలు అందుతాయి. అదే విధంగా ముందుగానే ఆకు కూరల్ని స్టీమ్ చేసి వండటం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. మరీ ఎక్కువ సేపు ఉడికించినా కూడా పోషకాలు అనేది అందవు. కాబట్టి ఎక్కువ సేపు వేయించకుండా వండాలి. ఆకు కూరలు వండేటప్పుడు ఆయిల్‌తో కాకుండా వెన్న, నెయ్యితో వండితే పోషకాలు అనేవి పోకుండా ఉంటాయి. మరీ ఎక్కువగా నెయ్యి కాకుండా.. కొద్దిగా ఆయిల్ కూడా వాడుకోవచ్చు. పెద్ద మంట మీద కుండా.. చిన్న మంట మీద ఉడికిస్తే పోషకాలు లభిస్తాయి.



# సంక్రాంతికి డాకూ మహారాజ్

**మన చౌరాస్తా, సినిమా :** నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరిలు ముఖ్య పాత్రల్లో దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం డాకు మహారాజ్. ఇటీవల విడుదలైన టైటిల్ టీజర్‌లో బాలకృష్ణ సరికొత్త లుక్, అద్భుతమైన విజువల్స్ కట్టిపడేశాయి. తాజాగా 'డాకు మహారాజ్' చిత్రీకరణ పూర్తయిందని నిర్మాతలు ప్రకటించారు. అయితే ఈ సినిమాలో ప్రేక్షకులను థ్రిల్ చేసే విధంగా క్రేజీ అతిథి పాత్రలు ఉంటాయని తెలిసింది. టాలీవుడ్‌లోని కొందరు యంగ్ హీరోలు అతిథి పాత్రల్లో కనిపించి ఆశ్చర్యపరచబోతున్నారట. ముందుగా ప్రకటించినట్లుగానే సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. 'డాకు మహారాజ్' చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.

# Varsha Digitals

మీ పుట్టిన రోజు, పెళ్లిరోజుల శుభాకాంక్షలు.. నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ మరియు క్యాలెండర్లను ఆకర్శనీయంగా డిజైనింగ్ చేయబడును..

వివరాలకు ఈ కింది నంబర్లను సంప్రదించండి.

**8555 800 812**

**9676 400 812**

